సుభద్ర బెంగుళూరులో లెక్చరర్‌గా పనిచేస్తున్నా- ఆవిడా తెలుగావిడే! భర్త యూనివర్సిటీలో ప్రొఫెసర్! ఏదో కాన్ఫరెన్స్‌కని అమెరికా వెళ్లారు. ఉన్న ఒక్క కూతురూ పెళ్ళయి అమెరికాలోనే ఉంది. లీవుల్లో ఏమీతోచక ఈ టూర్‌కి టికెట్ కొన్నానని వారిద్దరికీ చెప్పింది.

హైదరాబాద్ బిర్లామందిర్‌లో దేవుడి దర్శనమయ్యాక- సుభద్ర, శిరీష ఆలయం మెట్లపై కూర్చున్నారు.

"సూర్య ఏడీ?" సుభద్ర అడిగింది.

"ఇక్కడే ఉన్నారే ఇంతసేపూ..! ప్రసాదం తేవడానికి వెళ్లారేమో..?!" అంది శిరీష.

"ఏ బంధుత్వం లేకున్నా ఓ బంధమై కూర్చున్నాడు సూర్య! ఈకాలం కుర్రాళ్ళు వయసు మళ్లినవాళ్ళని పట్టించుకోరు సరికదా- ఎగతాళిగా నవ్వుతుంటారు. సూర్య కుర్రాడైనా ఎంతో ఓపికగా ప్రతిచోటా నాతోనే వుండి, ఏం కావాలన్నా తెచ్చిస్తూ, మందులు గుర్తుచేస్తూ ఎంతో శ్రద్ధ తీసుకుంటున్నాడు!" అంది సుభద్ర.

"కొంతమంది అంతే! కాలం వాళ్ళపై పెద్దగా ప్రభావం చూపదు. అయినా మంచితనానికి కాలంతో పనేముంది... మనసులతో గాని!"

ఇంతలో సూర్య స్వీట్‌ప్యాకెట్‌తో వచ్చి వాళ్ళిద్దరికీ స్వీట్లు పంచాడు.

"ఏమిటి విశేషం?" సుభద్ర అడిగింది.

"నా పుట్టినరోజు!"

"అరెఁ... మెల్లగా చెప్పారేమిటి? మెనీ హేపీ రిటర్న్స్ ఆఫ్ ది డే!" శిరీష చెప్పింది.

"నూరేళ్లూ పిల్లాపాపలతో చల్లగా ఉండు నాయనా!" సుభద్ర దీవించింది.

"ముందే చెప్పివుంటే నిన్న గిఫ్ట్ కొని ఉండేదాన్నిగా?!" అంది శిరీష చిరుకోపంగా.

"మీ విషెస్, అమ్మగారి బ్లెస్సింగ్స్ కంటే గొప్ప గిఫ్ట్స్ ఏముంటాయి?"

"నిజమేననుకోండి... అయినా మా గుర్తుగా కొనిచ్చేవాళ్ళం!"

"మిమ్మల్ని మరచిపోతేగా... గుర్తుతెచ్చుకోవడానికి!"

"మీతో మాట్లాడలేం బాబూ! ఇంత బాగా మాట్లాడుతారే... కథలు రాయకూడదూ మీరు?"

"రాయలేదని ఎవరన్నారు..? మొన్నే హాఫ్ సెంచరీ పూర్తిచేశాను!"

"రియల్లీ... ఎందులో వస్తాయి మీ కథలు?"

"ఆంధ్రభూమిలో వస్తూ ఉంటాయి!"

"అయితే మీదగ్గర ఓ ఆటోగ్రాఫ్, మీతో ఓ ఫోటో తీసుకోవాలి. మీరు గొప్పవారయిపోతే మాకు దొరకడం కష్టం!"

వీళ్ళ మాటలు విని అదే బస్సులో ప్రయాణిస్తున్న తెలుగువారు సుబ్బారావు, అతని భార్య, కూతురు భాగ్యలక్ష్మి వీళ్ళ దగ్గరికి వచ్చారు.

"మీరు ఏ పేరుతో వ్రాస్తుంటారు కథలు?" భాగ్యలక్ష్మి అడిగింది.

"చైతన్య- అన్నపేరుతో!"

"నేను చదివాను మీ కథలు! నైతిక విలువలపై చాలా బాగా రాస్తారు మీరు!" అభినందిస్తూ అన్నాడు సుబ్బారావు.

"రాయడం కన్నా ఆచరించడం గొప్ప!" అంది భాగ్యలక్ష్మి.

